దుర్గమ్మా.. దీవించమ్మా..

దేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం అమ్మవార్లను శ్రీమహాలక్ష్మిగా అలంకరించారు. పలు ఆలయాల్లో హోమాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. భౌరంపేట్‌లో అమ్మవారిని రూ81,04,116 విలువైన నోట్ల కట్లలతో అలంకరించారు. – జగద్గిరిగుట్ట



నిజాంపేట్ దుర్గామాత ఆలయంలో హోమంలో పాల్గొన్న భక్తులు



అలంకరణలో పేట్‌బషీరాబాద్‌లోని కట్టమైసమ్మ



దూలపల్లిలో లక్ష్మీదేవి అవతారంలో అమ్మవారు



భౌరంపేట్‌లో నోట్లతో అలంకరించిన..



మహాలక్ష్మిగా గాజులరామారం చిత్తారమ్మదేవి



పేట్‌బషీరాబాద్ కట్టమైసమ్మ ఆలయంలో హోమం..

ఘనంగా ఐలమ్మ జయంతి

నిజాంపేట్: నిజాం ప్రభుత్వాన్ని ఎదిరించి పోరాడిన వీరవనిత చాకలి ఐలమ్మ అని ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి దాసి నాగరాజు అన్నారు. శుక్రవారం చాకలి ఐలమ్మ జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి పూలమాలేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎం.జోసెఫ్, ఝాన్సీరాణి, కిరణ్, రాజుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఫేజ్ 1లో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్)ను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ వాసులు, ఆసుపత్రి వైద్యులు ఆరోగ్య కేంద్రానికి అవసరమైన సౌకర్యాలను వివరంగా తెలియజేశారు. ఆరోగ్య కేంద్రం ద్వారా స్థానికులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

హైడ్రా బాధితులకు అండగా నిలుస్తాం

బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: బడా బాబులను వదిలేసి పేద ప్రజలపై హైడ్రా ఉక్కు పాదం మోపడం సరికాదని, హైడ్రా బాధితులకు అండగా ఉంటామని బీఆర్ఎస్ విప్, ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. శుక్రవారం గాజులరామారం డివిజన్ బాలయ్య నగర్, గాలి పోచమ్మ బస్తీలలో ఆయన పర్యటించి ఇటీవల హైడ్రా ఆధ్వర్యంలో కూల్చివేసిన ఇళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సర్వే నెంబర్ 307లో ఏళ్లకు ఏళ్లుగా నివాసం ఉంటున్న రెక్కాడితే గానీ డొక్కాడని పేదవాళ్ల నివాసాలను పండుగ పూట అధికారులు కూల్చివేయడం దారుణమన్నారు. కూల్చివేతలపై త్వరలోనే హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి పూర్తి సమాచారం అందజేస్తామని, నిజమైన బాధితులకు అండగా ఉండి వారికి న్యాయం చేస్తామన్నారు.



బాలయ్యనగర్‌లో కూల్చివేసిన ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వివేకానంద్

కాలనీ ముఖద్వారానికి శంకుస్థాపన

కుత్బుల్లాపూర్: కాలనీ వాసులు ఐక్యంగా ఒక తాటిపై ఉన్నప్పుడే అభివృద్ధి సాధ్యపడుతుందని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. గాజులరామారం డివిజన్ మెట్‌కానిగూడలో అయ్యప్ప కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించనున్న అయ్యప్ప ఆలయం, కాలనీ ముఖ ద్వారాలకు శుక్రవారం ఆయన ముఖ్య అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు రవిశంకర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జయరామ్, ప్రధాన కార్యదర్శి నరేంద్ర సర్కార్, సలహాదారులు ఈశ్వర్ రెడ్డి, సభ్యులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

రేపు యాంటీ రేబీస్ ఉచిత టీకా శిబిరం

నిజాంపేట్: రేబీస్ ఫ్రీ తెలంగాణ బ్లూ క్రాస్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో యాంటీ రేబీస్ ఉచిత టీకా శిబిరం నిర్వహించనున్నట్లు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రగతినగర్, త్రీ మంకీస్ జంక్షన్ వద్ద ఈ నెల 28న ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ శిబిరాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. పెంపుడు కుక్కలకు రాబిస్ వ్యాక్సిన్‌ను ఉచితంగా ఇవ్వనున్నందున కుక్కలను పెంచుకునే యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

దుండిగల్: దుండిగల్ గ్రామ పరిధిలోని చిన్న దామరా చెరువు వద్ద బతుకమ్మ మెట్ల పనులను శుక్రవారం దుండిగల్ మాజీ సర్పంచ్ కావలి గణేష్ పరిశీలించారు. పండుగ రోజు మహిళలు ఇబ్బందులు పడకుండా ఉండేలా మెట్ల నిర్మాణం, చెరువు పరిసరాల అభివృద్ధి పనులు తక్షణమే వేగంగా పూర్తి చేయాలని సూచించారు. చెరువు పరిసరాల్లో శుభ్రత, మెట్లు, విద్యుత్ లైట్లు, మహిళలకు వసతులు వంటి అంశాలను అధికారుల దృష్టికి తీసుకు వెళ్తానన్నారు. కార్యక్రమంలో దొంతి మహేష్, పోతారం మల్లేష్, రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

వృక్ష పెంపకందారుల మేళా

సుభాష్‌నగర్: చెట్టు జీవిత కాలంలో ప్రకృతి పరంగా 50 లక్షల విలువ చేసే పర్యావరణం అందిస్తుందని స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డాక్టర్. జి. చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. దూలపల్లిలోని అటవీ జీవవైవిధ్య ప్రాంగణంలో శుక్రవారం వృక్ష పెంపకందారుల ఉత్సవం (మేళా) నిర్వహించారు. కార్యక్రమానికి రాష్ట్ర నలుమూలల నుంచి రైతులు, పర్యావరణ ప్రేమికులు, శాస్త్రవేత్తలు, అటవీశాఖ ఉన్నత అధికారులు హాజరయ్యారు. అటవీ ఉత్పత్తుల ప్రాముఖ్యతను చర్చించడానికి రైతులు, శాస్త్రవేత్తలు ఒకే వేదికపైకి తీసుకురావడం ఈ ఉత్సవం యొక్క ప్రధాన లక్ష్యం. స్థిరమైన అభివృద్ధి వైపు ముందుకు సాగడానికి అవసరమైన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఫారెస్ట్ కాలేజ్ ములుగు, తెలంగాణ మెడిసినల్ ప్లాంట్స్ ఇనిస్టిట్యూట్, ట్రైబల్ కో ఆపరేటివ్ సొసైటీ ద్వారా అటవీ ఉత్పత్తుల స్టాళ్లను ఏర్పాటు చేశారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రిటైర్డ్ స్టేట్ చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ వెంకటరెడ్డి, ఐఎఫ్ఎస్‌లు డాక్టర్ సుధీకర్‌కుమార్, డాక్టర్ పట్నాయక్, డాక్టర్ పంకజ్‌సింగ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ.. దేశంలో చెట్లను ప్రభుత్వం కంటే 90 శాతం రైతులే పెంచుతున్నారని గుర్తు చేశారు. మొక్కలను నాటి 5 సంవత్సరాలు వాటిని సంరక్షిస్తే వాటి ఫలాలను పొందుతామని తెలిపారు. అభివృద్ధి చెందిన దేశాలతో పాటు మన దేశంలోని బెంగళూరు, త్రిపుర విమానాశ్రయాలు, ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు వెదురు బొంగులతోనే కట్టడం మనం చూస్తున్నామని, భవిష్యత్‌లో కలపకు ఎంతో డిమాండ్ ఉంటుందని వివరించారు.

శ్రీలలితా సహస్ర నామ పారాయణం



దుండిగల్: శ్రీదేవీ శరన్నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం దుండిగల్‌లోని శ్రీగణపతి సచ్చిదానం ఆశ్రమంలోని దత్త పీఠంలో విశాలాక్షి శిష్య బృందం సభ్యులు లలితా సహస్ర నామ పారాయణం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఠం నిర్వాహకులు మాట్లాడుతూ.. నవరాత్రుల్లో లలితా సహస్ర పారాయణం చేయడం ఎంతో పుణ్యాన్ని ఇస్తుందని, పారాయణం చేసిన విశాలాక్షి బృందాన్ని అభినందించారు.